క్లుప్తంగా

బ్యాంకింగ్ సేవలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు: బ్యాంకింగ్ సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా సూచించారు. శుక్రవారం స్థానిక రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో రైల్వే ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నేతృత్వంలో ఫైనాన్స్ లిటరసీ, సేఫ్ ఇన్వెస్ట్‌మెంట్‌పై ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు చేయడం ద్వారా మీతోపాటు మీ కుటుంబానికి ఆర్థిక భరోసా ఉంటుందన్నారు. పోస్ట్ ఆఫీస్ సేవింగ్ స్కీమ్, సీనియర్ సిటిజన్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్), పీఎం వయవందన యోజన పథకం తదితర స్కీమ్‌ల గురించి వివరించారు. కార్యక్రమంలో సీనియర్ డీపీఓ కోర్డినేషన్ హెచ్ఎల్ఎస్ ప్రసాద్, సీనియర్ డీఓఎం డాక్టర్ ఎం.శ్రవణ్‌కుమార్, ఎస్‌బీఐ బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌శర్మకు గురు పురస్కారం


పురస్కారం అందుకుంటున్న కోడూరు ప్రభాకర్‌శర్మ

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం సమీపంలో వ్యాస భగవాన్ బ్రాహ్మణ సత్రం నిర్వహిస్తున్న కోడూరు ప్రభాకర్‌శర్మను అఖిల భారతీయ బ్రాహ్మణ సంఘం గురు పురస్కారంతో సత్కరించింది. వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్న బ్రాహ్మణ సంఘం సభ్యులను సత్కరించే క్రమంలో భాగంగా అఖిల భారతీయ మహా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న నరసరావు పేటలో గురు పురస్కారం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాక్రిష్ణ మనవడు సుబ్రమణ్యశర్మ ముఖ్య అతిథిగా హాజరై గురు పురస్కారాలను పంపిణీ చేశారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం


విద్యార్థినికి నగదు అందజేస్తున్న నందవరం కేశవరెడ్డి

పెద్దపప్పూరు: మండలంలోని పెద్దయక్కలూరు ఉన్నత పాఠశాలలో పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శుక్రవారం రిటైర్డు అధ్యాపకుడు నందవరం కేశవరెడ్డి నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏటా తాను చదువుకున్న పాఠశాలలో నగదు ప్రోత్సాహాన్ని పంపిణీ చేస్తున్నానన్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విజయ్‌కి రూ.5 వేలు, నిజాముద్దీన్‌కు రూ.4 వేలు, గురుప్రసాద్‌రెడ్డికి రూ.3 వేలు, ఇందూకు రూ.2 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు రవికుమార్, ఓబులపతి, ఉపాధ్యాయులు శారద, క్రిష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ బోల్తా - వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో శుక్రవారం బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో బైక్‌ను డ్రైవ్ చేస్తున్న రామన్న గాయపడ్డాడు. గుంతకల్లుకు చెందిన రామన్న గుత్తికి వచ్చి తిరిగి వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రి తనిఖీ


వైద్యులతో మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు

యాడికి: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని శుక్రవారం జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ వైద్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యాడికి నంబర్-4 సచివాలయానికి సంబంధించిన 2023 నుంచి 2025 వరకూ రికార్డులు పరిశీలించారు. గర్భిణులు, పిల్లల వైద్య సేవలకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియ గురించి ఆరా తీశారు. ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేయాలో సూచనలు , సలహాలిచ్చారు. ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ సమావేశపరిచి ఆన్‌లైన్‌లో ఎలాంటి తప్పులు జరగకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డీపీఓ కిశోర్ కుమార్, ఎంఐఎస్ జరీనా, స్థానిక వైద్యులు పరమేశ్వర, సాయి సుమంత్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఊరిస్తూ.. ఉసూరుమనిపిస్తూ..

- కార్తెలన్నీ వెళ్తున్నా వరుణుడి కరుణ కరువాయే..
- పంటల సాగుకు నోచుకోని పొలాలు
- ఆందోళనలో అన్నదాతలు

అదునులో పదును కాకపోవడంతో ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది. గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. ఆకాశం మేఘావృతం కావడం .. ఆ తర్వాత ఆవిరి కావడంతో అన్నదాతలు నిరాశ చెందుతున్నారు. అప్పు చేసి పొలాలు, విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్నారు. వర్షం ఎప్పుడు పడుతుందో.. పొలాల్లో విత్తనం ఎప్పుడు వేయాలో అని ఆశగా ఎదురుచూస్తున్నారు. గత ఏడాది వాతావరణం అనుకూలించడంతో జూలై మొదటి వారానికి 90 శాతం సాగు పూర్తయ్యింది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా విత్తనం పడలేదు.


రామరాజుపల్లిలో సాగుకు నోచుకోని పొలాలు

పామిడి: వ్యవసాయానికి అనుకూలమైన కార్తెలన్నీ దాటుతున్నా వరుణుడి కరుణ కరువైంది. ఏటా జూన్ నెలాఖరులోని ఆరుద్ర కార్తెకంతా వర్షాలు కురిసి రైతులు పంటల సాగులో నిమగ్నమయ్యేవారు. అలాంటింది పెద్దపునర్వసు కార్తె దాటి చిన్న పునర్వసుకార్తె రాసున్నా ఇంకా వర్షాలు ఊరిస్తున్నాయి. ఇప్పటికే పత్తి పంటతో పాటు వేరుశనగ, కంది ఇతరత్రా పంటలు సాగుకు నోచుకుని ఉంటే దిగుబడి బాగా ఉండేది. ఇక వర్షాలు కురిసినా ఆశించిన స్థాయిలో దిగుబడి రాదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అరకొర వర్షాలకు పొలాలను చదును చేసుకుని వర్షం కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. ఒకవేళ వర్షాలు కురిసినా పత్తిపంటకు పురుగుల ఉధృతితో దిగుబడి శూన్యమన్నది రైతులనుంచి వ్యక్తమవుతోంది. దీనికితోడు వేరుశనగ, ఇతరత్రా పంటలకు సైతం ప్రతికూల పరిస్థితుల వల్ల ఆశించిన స్థాయిలో దిగుబడి లేక నష్ట పోవాల్సిందేనని రైతులు బాహాటంగా చెపుతున్నారు.

గతంలో ఇప్పటికే 17 వేల ఎకరాల్లో పంటల సాగు

గత 2023-24 ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే మండల వ్యాప్తంగా 17 వేల ఎకరాల్లో పంటలు సాగైంది. గత ఏడాది పత్తి 7 వేలు ఎకరాలు, వేరుశనగ 5 వేల ఎకరాలు, కంది 4 వేల ఎకరాలు, కూరగాయలు ఇతరత్రా పంటలు 1000 ఎకరాల్లో సాగయ్యాయి. 2024-25 ఖరీఫ్ సీజన్‌లో సాగుకు సమయం దాటిపోతున్నా వాన జాడ కరువైంది. దీంతో చదును చేసుకున్న పంట పొలాల వద్ద రైతన్నలు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. దీనికితోడు కూటమి ప్రభుత్వం గత ఏడాది పంట నష్టానికి సంబంధించి ఇన్సూరెన్స్ అందజేయలేదు. అలాగే ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయకపోవడంతో రైతులు అప్పు చేసి మరీ పంటల సాగుకు సిద్ధమయ్యారు. అయితే అదునులో వర్షం రాకపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షం కోసం ఎదురుచూపు



మాది వ్యవసాయాధారిత కుటుంబం. గ్రామంలోని 22 ఎకరాల్లో పంటలు సాగుచేసి కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడిని. గత ఏడాది సైతం ఆశించిన స్థాయిలో పంటలు లేక నష్టపోయాం. ఈ ఖరీఫ్‌లో నైనా వర్షాలు సకాలంలో కురిస్తాయనుకుంటే కురువక లేదు, పొలాల వద్ద వర్షం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి.

–వైసీ ఓబులేసు, రైతు ఓబుళాపురం

ఆసక్తి సన్నగిల్లుతోంది



నాకు పది ఎకరాలు పొలం ఉంది. పత్తి, వేరుశనగ వంటి పంటలు సాగుచేసుకుని జీవనం సాగించేవాడిని. గతంలో అరకొర పంట దిగుబడితో దెబ్బతినగా, ఈఏడాది సకాలంలో వర్షాలు రాకపోవడం రైతులను కృంగదీస్తోంది. దీంతో వ్యవసాయం అంటేనే ఆసక్తి సన్నగిల్లుతోంది.

– పీ లక్ష్మణ్, రైతు, కట్టకిందపల్లి

పత్తికి పురుగుల ఉధృతి తప్పదు



నాకు గ్రామంలో ఉమ్మడి పొలం కింద 30 ఎకరాలు ఉంది. వర్షం రాకపోవడంతో పంటలు సాగు చేయలేకపోతున్నా. ఇక వర్షాలు కురిసినా పత్తి పంటకు ప్రయోజనం ఉండదు. పైరుకు పురుగు ఆశించి దిగుబడి తుడిచి పెట్టుకుపోతుంది. దీంతో రైతు అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సిన దుస్థితి నెలకొంది.

– వీ దేవేంద్రరెడ్డి, రైతు, రామరాజుపల్లి

వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు


కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలో వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశాల మేరకు నిర్వహించిన రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆయా మండలాల నుం – పెద్ద ఎత్తున హాజరైన నాయకులకు, కార్యకర్తలకు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి దౌర్జన్యాలకు దిగుతున్నా.. అక్రమ కేసులు బనాయిస్తున్నా కేవలం నా మీద ప్రేమ, నమ్మకంతో ఒక్క పిలుపుతో ఇంత పెద్దఎత్తున వచ్చి సభను జయప్రదం చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రతి కార్యకర్త కుటుంబానికి కేతిరెడ్డి కుటుంబం అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ అండతో పోలీసులను అడ్డుపెట్టి ఎన్ని ఇబ్బందులు పెట్టినా తాడిపత్రికి తప్పక వస్తానని.. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్నారు.

వ్యక్తిత్వ హననం సరికాదు


నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: మాజీ మంత్రి రోజాపై వ్యక్తిత్వ హననం చేసేలా మాట్లాడటం సరికాదని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సి.బి.నైరుతిరెడ్డి అన్నారు. మహిళా లోకం అసహ్యించుకునేలా మాజీ మంత్రి ఆర్కే రోజాపై నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై గొంతెత్తినందుకు ఆమెను అసభ్యకరంగా దుర్భాషలాడటం సిగ్గుచేటన్నారు. మాజీ మంత్రి రోజాకు, మహిళా లోకానికి భానుప్రకాష్ క్షమాపణలు చెప్పాలని ఆమె శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. భవిష్యత్తులో మహిళల గురించి ఎవరూ నీచంగా మాట్లాడినా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సాంకేతిక పద్ధతుల ద్వారా పరిశోధన


క్షేత్రస్థాయి పర్యటనలో శాస్త్రవేత్తలు

బుక్కరాయసముద్రం: శాస్త్రవేత్తలు సాంకేతిక పద్ధతులను ఉపయోగించి పరిశోధనలు చేయాలని తిరుపతి ప్రిన్సిపల్ సైటింటిస్ట్ డాక్టర్ రమణ సూచించారు. శుక్రవారం మండలంలోని రెడ్డిపల్లి కేవీకేలో వ్యవసాయ అనుబంధ రంగాల్లో అధునాతన సాంకేతిక పద్ధతుల గురించి రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలు రైతులకు సులభ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు. పరిశోధనల్లో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకోవాలన్నారు. వ్యవసాయంలో అధునాతన పద్ధతుల ద్వారా సమగ్ర పురుగుల యాజమాన్యంపై కీటక విభాగం ప్రిన్సిపల్ సైంటిస్ట్ తిరుపతి డాక్టర్ మురళీక్రిష్ణ వివరించారు. మార్కెటింగ్, ఆన్‌లైన్ పద్ధతుల ద్వారా ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై విస్తరణా శాస్త్రవేత్త తిరుపతి డాక్టర్ మోహన్ వివరించారు. కార్యక్రమలంలో డాక్టర్ ప్రశాంతి డాక్టర్ పి.స్వామి, రేకులకుంట ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, అసోసియేట్ డైరెక్టర్ జాన్సన్, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెకు వైఎస్సార్‌సీపీ మద్దతు


కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుత్తి: సమస్యల పరిష్కారం కోసం ఆరు రోజులుగా మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మెకు వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం మద్దతు ప్రకటించారు. పట్టణ, మండల కన్వీనర్లు మధుసూదన్ రెడ్డి, గంగరాజు, మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ , జిల్లా కార్యదర్శి గురు ప్రసాద్ యాదవ్, పట్టణ ప్రచార విభాగం అధ్యక్షులు వెల్డింగ్ రవూఫ్, క్రిస్టియన్ మైనార్టీ పట్టణ అధ్యక్షులు గ్లాడ్‌స్టోన్, కౌన్సిలర్లు వరదరాజులు,ఫరూక్, కేవీ రమణ, నరేష్, ఉపాధ్యక్షులు షఫీ, రంగస్వామి, సీనియర్ నాయకులు రామ రంగారెడ్డి, రమేష్ రెడ్డి, అబ్దుల్ తదితరులు సమ్మె శిబిరం వద్దకు వెళ్లి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు రంగస్వామి, షఫి మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కార్మికులకు అండగా నిలిచిందన్నారు. అన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలు వర్తింపజేశామన్నారు. అయితే కూటమి ప్రభుత్వం కార్మికుల సమస్యలను గాలికొదిలేసిందన్నారు. కాగా శుక్రవారం మున్సిపల్ కార్మికులు ఆరు బయట వంటా వార్పు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ డిమాండ్లను పరిష్కారం చేసే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని మున్సిపల్ యూనియన్ నాయకులు రాజా, సూరి, రామాంజి, ఆది తేల్చిచెప్పారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంజునాథరెడ్డి

గుంతకల్లు రూరల్: మండలంలోని గుండాల తండా గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సక్రునాయక్ (55) గురువారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందాడు. శుక్రవారం ఉదయం వైఎస్సార్‌సీపీ నాయకుడు మంజునాథరెడ్డి ఆ గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ అన్ని విధాలా అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని సక్రునాయక్ భార్య రంగమ్మ, పిల్లలకు భరోసా ఇచ్చారు.

విద్యుత్ లోక్ అదాలత్‌కు 10 అర్జీలు


లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విద్యుత్ లోక్ అదాలత్ కార్యక్రమానికి 10 అర్జీలు వచ్చినట్లు ఏడీలు ప్రభాకర్‌రావు, వసంతయ్య తెలిపారు. తాడిపత్రి డివిజనల్‌లోని డీ1, డీ2, యాడికి, తాడిపత్రి రూరల్ సబ్‌డివిజన్ పరిధిలో ఒక్కో అర్జీ, తాడిపత్రి సీసీఓ సబ్ డివిజన్ పరిధిలోని పుట్లూరు నుంచి ఐదు, యల్లనూరు నుంచి ఒక అర్జీ వచ్చిందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయులు మూర్తి, జనరల్ మేనేజర్ జి. మధుకుమార్, విజయలక్ష్మి, అయా మండలాల ట్రాన్స్‌కో ఏఈలు పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరిన రిలే దీక్ష

పామిడి: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఐక్యమాదిగ సమాజ్ ఆధ్వర్యంలో ఆర్టీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ కోసం చేపట్టిన వంద గంటల రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ఐదో రోజుకు చేరాయి. ఆ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజుకాలువ వెంకటేష్‌తో పాటు లక్ష్మీనారాయణ, రాజ్‌కుమార్, కేశవ, రహంతుల్లా, ఓబుళపతి, నాగశేఖర్, సర్వేష్, వన్నూరప్ప, వడ్డే లక్ష్మయ్య రిలే దీక్షలో కూర్చొన్నారు.

అదనపు పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదన


మాట్లాడుతున్న నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మల్లికార్జున

శింగనమల: పోలింగ్ కేంద్రాల్లో 1,200 పైన ఓటర్లుంటే అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతామని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మల్లికార్జున తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శింగనమల మండలంలో రెండు, గార్లదిన్నె మండలంలో రెండు, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున అదనంగా పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు ప్రతిపాదిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి, ఎన్నికల డిప్యూటి తహసీల్దార్ హబీబ్, జెడ్పీటీసీ నీలం భాస్కర్, జిల్లా అధికార ప్రతినిధి ఎస్‌వీ నారాయణ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పల్లెల్లో గ్రామసభలు

యల్లనూరు: మండలంలోని పెద్దమల్లేపల్లి, 85-నిట్టూరు గ్రామాల్లో పీ4 సర్వేపై శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కరుణసాగర్ మాట్లాడుతూ ప్రతి మండలస్థాయి అధికారి ఒక్కొక్కరు మూడు కుటుంబాలను దత్తత తీసుకోవాలని, గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు ఒక్క కుటుంబాన్ని తీసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 1,435 దారిద్రరేఖ దిగువున ఉన్న, వెనుకబడిన తరగతుల కుటుంబాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సురేష్, సలీం, ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

పెద్దవడుగూరు: మండలంలో శనివారం నుంచి పీ4 సర్వేపై గ్రామ సభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బారన్‌సాహెబ్ తెలిపారు. 19న అప్పేచర్ల, ఏ.తిమ్మాపురం, బుర్నాకుంట, ముప్పాలగుత్తి, 22న చిన్నవడుగూరు, పి.కొట్టాలపల్లి, పి.వీరన్నపల్లి, చిత్రచేడు , 23న చిట్టూరు, రాంపురం, దిమ్మగుడి, కండ్లగూడూరు, 24న క్రిష్టిపాడు, లక్ష్మంపల్లి, మల్లేనిపల్లి, 25న మేడిమాకులపల్లి, చింతలచెరువు, 26న గుత్తిఅనంతపురం, మిడుతూరు, కాశేపల్లి, పెద్దవడుగూరు, రావులుడికి, భీమునిపల్లి, 29న విరుపాపురం, జి.వెంకటాంపల్లిలో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. కేటాయించిన గ్రామాల్లో అధికారులు సభలు నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

వీరన్న సేవలు చిరస్మరణీయం

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన వీరన్న సేవలు చిరస్మరణీయమని సీపీఎం మండల కార్యదర్శి దస్తగిరి అన్నారు. శుక్రవారం మండలంలోని క్రిష్టిపాడులో వీరన్న స్థూపం వద్ద వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థూపం వద్ద సీపీఎం కార్యకర్తలు, కేవీపీఎస్ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు మద్దిలేటి, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు హరిగోపాల్, గొడ్డలి రాయుడు, సూర్యప్రకాష్, సుంకన్న, పెద్ద శ్రీరాములు, గోపాల్, ఈరమ్మ, బీబీ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవారు


గుంతకల్లు టౌన్: మారెమ్మదేవి


తాడిపత్రి రూరల్: అంబాభవాని

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మస్తాన్‌పేట మారెమ్మ దేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాకంబరిదేవిగా మారెమ్మ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, ఇతర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ పెద్దలు రామ్మోహన్ తదితరులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

తాడిపత్రి రూరల్: పట్టణంలోని అంబాభవాని వీధిలో శుక్రవారం శాకంబరీదేవి అలంకరణలో అంబభవానిమాత భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారిని వివిధ రకాల కురగాయాలతో అలంకరించారు. అమ్మవారి దర్శనార్థం వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

పాఠశాలకు బీరువా, కుర్చీ వితరణ


బీరువా, కుర్చీ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గార్లదిన్నె: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు శుక్రవారం పూర్వ విద్యార్థులు బీరువా,కుర్చీ వితరణ చేశారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ 2002-2003లో పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఇటీవల ఆత్మీయ కలయిక సందర్భంగా పాఠశాలకు బీరువా, కుర్చీ అందించాలని తీర్మానం చేశామన్నారు. అందులో భాగంగా రూ.15 వేలు విలువ చేసే బీరువా, కుర్చీ అందజేశామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శివ, శేషు తదితరులు పాల్గొన్నారు.

వీకే ఆదినారాయణరెడ్డికి నివాళి


యాడికిలో వీకే ఆదినారాయణరెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు


తాడిపత్రిలో వీకే ఆదినారాయణరెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

యాడికి/తాడిపత్రి రూరల్/పెద్దవడుగూరు: రాయలసీమ అభివృద్ధికి, అనంతపురం జిల్లాను కరువు కోరల నుంచి రక్షించడానికి అనేక ఉద్యమాలు కొనసాగించిన పోరాటయోధుడు వీకే ఆదినారాయణ రెడ్డి అని సీపీఐ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని నారాయణ స్వామి కాలనీలో వర్ధంతి సందర్భంగా వీకే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వీకే ప్రదీప్‌రెడ్డి, సీపీఐ తాలూకా కార్యదర్శి రంగయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడు యాదవ్, సీపీఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ, నాయకులు జూటూరు బషీర్, రజాక్ శివన్న, కుళ్లాయి రెడ్డి, బండారు రాఘవ, వడ్డె రాముడు, కాలనీవాసులు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి పట్టణంలోని రంగప్ప కాలనీలో శుక్రవారం వీకే ఆదినారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ అధ్యక్షుడు రంగయ్య, మండల కార్యదర్శి నాగరంగయ్య, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, మండల సహాయ కార్యదర్శి నారాయణరెడ్డి, నాయకులు నాగార్జున, వీరప్ప, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పెద్దవడుగూరులోని సీపీఐ కార్యాలయంలో వి.కె.ఆదినారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు నారాయణ, మండల సహాయ కార్యదర్శి పోలా రంగస్వామి, నాయకులు సుధాకర్‌గౌడ్, నాగేంద్ర, కిరణ్, శ్రీరాములు, ఓంనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మేథోశక్తి పెంపు


విద్యార్థులకు ధ్యానంపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: విద్యార్థులు ధ్యానం చేయడం వలన మేథోశక్తి పెంపొందుకోవచ్చని బ్రహర్షి సుభాష్ పత్రీజీ ధ్యాన మందిరం నిర్వాహకుడు మల్లికార్జున సూచించారు. శుక్రవారం మండలంలోని లక్ష్మంపల్లి జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానం ఎలా చేయాలో శిక్షణ ఇచ్చారు. అనంతరం ధ్యానం చేయడం వలన కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.